క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



వెంకటాచలం: వెంకటాచలం తహసీల్దార్‌గా పాల కృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న వై.నాగరాజును ఇటీవల కలెక్టర్ సస్పెండ్ చేశారు. సైదాపురంలో విధులు నిర్వహిస్తున్న పాల కృష్ణను వెంకటాచలానికి బదిలీ చేశారు. నూతన తహసీల్దార్‌కు డీటీ సుభాషిణి, వీఆర్వోలు పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పేర్నాటిని ఆశీర్వదించాలి



ఇందుకూరుపేట: తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్న పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో ఆశీర్వదించాలని ఆ పార్టీ నాయకులు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మైపాడు, నరసాపురం, కొరుటూరు, తదితర గ్రామాల్లోని పట్టభద్రులను కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, ఇనమాల వెంకటాద్రి నెల్లపూడి శివయ్య, శరణ్, ఆకుల ఏడుకొండలు, కమతం మల్లికార్జున, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు ఆఫీస్ ఎదుట ధర్నా

వెంకటాచలం: ఈనాడు దినపత్రికలో రాసిన తప్పుడు కథనం వల్ల తన అంగడికి పౌరసరఫరాల అధికారులు సీల్ వేశారంటూ చెముడుగుంట వద్ద ఉన్న ఈనాడు కార్యాలయం ఎదుట జంగం వీరకుమార్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈనాడు పత్రికకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీరకుమార్ మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు రోడ్డు వద్ద తాను నిర్వహించే అంగడి వద్దకు ఇటీవల ఈనాడు విలేకరులు వచ్చి మామూళ్లు అడగ్గా, తాను ఇవ్వలేదని చెప్పారు. దీంతో బయోడీజిల్ అమ్ముతున్నానని తప్పుడు కథనాలు రాసి, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి అంగడికి సీల్ వేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు కథనాలు రాసి తనను మానసిక క్షోభకు గురిచేసిన ఈనాడు విలేకరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై డీఎస్ఓ టీ వెంకటేశ్వర్లును వివరణ కోరగా జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా ఆయిల్ విక్రయిస్తున్న నాలుగు దుకాణాలను సీజ్ చేశామని చెప్పారు. వెంకటాచలం వద్ద అనుమతి లేకుండా ఆయిల్ విక్రయిస్తుండడంతో సీజ్ చేశామని తెలిపారు. బయోడీజిల్ అమ్మాలంటే బీ–100 అనుమతి సర్టిఫికెట్ ఉండాలని తెలిపారు.

స్పందనకు వినతులు

పొదలకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. దారి వివాదాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఇంటి నివేశన స్థలాలకు సంబంధించి అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ తెలిపారు.

సంక్షేమ పథకాలతో సిరుల పంట

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సిరుల పంట పండిందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పడుగుపాడు చంద్రమౌళీనగర్ గిరిజన కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతరాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, సంక్షేమపథకాలను గడప గడపకు చేరవేస్తున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం సాగిస్తున్నాయన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్న, సంక్షేమ పథకాలు కొనసాగాలన్న సీఎం వైఎస్ జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. కోవూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 49 సచివాలయాల పరిధిలో 55వేల గడపలు తిరిగామన్నారు. సంక్షేమ నిధులతో పడుగుపాడులో బ్రిడ్జి, డ్రైనేజీలు పూర్తి చేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో అత్యవసర పనులను చేపట్టడం జరిగిందన్నారు. డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మణ్, ప్రమీల, బాబురావు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఎమ్మెల్యే ప్రసన్న చేయూత



చిన్నారులకు బాండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న



దివ్యాంగుడికి బ్యాటరీ సైకిల్‌ను అందజేస్తున్న నాయకులు

కోవూరు: కోవూరుకు చెందిన పలువురు చిన్నారులకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూతనందించారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా కోవూరులో పర్యటించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చిన్నారుల కుటుంబ ఆర్థిక పరిస్థితులను తెలుసుకుని తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం ప్రకటించారు. కోవూరు పారువేటి వీధికి చెందిన నాపా గీతాంజలికి రూ.20వేలు, నాపా సురేంద్రకు రూ.20వేలు, గమళ్లపాళేనికి చెందిన బండ్ల మౌనికకు రూ.20వేలు చొప్పున 18ఏళ్లకు ఫిక్సిడ్ డిపాజిట్లు చేయించారు. ఈ బాండ్లను చిన్నారులకు ఎమ్మెల్యే సోమవారం అందజేశారు. అలాగే చంద్ర మౌళినగర్ గిరిజన కాలనీకి చెందిన వలంటీర్ అలేఖ్య ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు.

దివ్యాంగుడికి బ్యాటరీ మోటార్ సైకిల్ వితరణ

జమ్మిపాళేనికి చెందిన సునీల్‌కు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.35వేలు విలువైన బ్యాటరీ సైకిల్‌ను వితరణ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వంలో దివ్యాంగుడికి ఇచ్చిన హామీ మేరకు బ్యాటరీ సైకిల్‌ను డీఏఏబీ చైర్మన్ నిరంజన్ బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు చిరంజీవి, నాయకులు వెంకటేశ్వర్లు, వెంకయ్య, విజయ, నాగారాజు పాల్గొన్నారు.

పాఠశాలల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలి



కొడవలూరు: మాట్లాడుతున్న ఎంఈఓ

కొడవలూరు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల సమగ్ర వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఎంఈఓ జీ వసంతకుమారి హెచ్‌ఎంలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లతో యుడైస్ ప్లస్‌పై సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లోని మౌలిక వసతులు, సామగ్రి, నిధుల వినియోగం, సౌకర్యాలు, బోధనా పద్ధతులు తదితరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు. హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. హెచ్‌ఎంలు జీ శ్రీనివాసరావు, సీహెచ్ లక్ష్మీప్రసూన, కేవీ శేషయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: ఉపాధ్యాయులు గుణాత్మక విద్యాబోధనపై దృష్టి సారించాలని ఎంఈఓ దిలీప్ అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు యుడైస్‌పై సోమవారం వర్క్‌షాపును నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పాఠశాలల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. 8వ తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌ల పనితీరును ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. రిసోర్స్‌పర్సన్ సుధీర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దుగ్గుంటలో 'గడప గడపకు..'

పొదలకూరు: మండలంలోని దుగ్గుంట సచివాలయ పరిధిలో మంగళవారం సాయంత్రం 4.30 గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.నగేష్ కుమారి సోమవారం తెలిపారు. అలాగే బుధవారం, శుక్రవారం కూడా అదే సచివాలయ పరిధిలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తారని తెలిపారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు హాజరుకావాలని తెలిపారు.

పొదలకూరులో గ్రిగ్స్ క్రీడా పోటీలు

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో 98వ గ్రిగ్స్ మెమోరియల్ క్రీడా పోటీలను పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించేందుకు హెచ్‌ఎం సనత్‌కుమార్ మండలంలోని పీఈటీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. త్వరలో పోటీల నిర్వహణ తేదీలను ప్రకటించనున్నట్లు తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై దాడి

బుచ్చిరెడ్డిపాళెం: ఆటో డ్రైవర్‌పై యువకుడు దాడి చేసి గాయపరిచిన ఘటన బుచ్చిరెడ్డిపాళెంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు..మోహన్ బాబు ఆటోను నడుపుకొంటూ వెళుతుండగా, బద్రి అనే యువకుడి మో టార్‌సైకిల్‌కు తగిలింది. దీంతో బద్రి తన మోటార్‌సైకిల్‌నే ఢీకొడుతావా అంటూ మోహన్‌బాబుపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

రేషన్ లబ్ధిదారుల నిరసన

ఇందుకూరుపేట: గంగపట్నంలోని మసీదు వీధికి చెందిన 35 కుటుంబాలకు సాంకేతిక కారణాలతో రేషన్ బియ్యం అందలేదు. దీంతో రేషన్ లబ్ధిదారులు సోమవారం నిరసన తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ సుబ్బయ్యను వివరణ కోరగా, సాంకేతిక కారణాలతో రేషన్ అందని కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రికెట్ పోటీల విజేత కొమ్మలపూడి జట్టు



విజేతగా నిలిచిన కొమ్మలపూడి జట్టు

మనుబోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సేవానాథం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఆర్ క్రికెట్ పోటీల్లో హెచ్‌సీసీ కొమ్మలపూడి జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 36 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో వైసీసీఎం మనుబోలు, హెచ్‌సీసీ కొమ్మలపూడి జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన కొమ్మలపూడి జట్టు నిర్ణీత ఓవర్లలో 74 పరుగులు చేయగా ఆపై మనుబోలు జట్టు 58 పరుగులు మాత్రమే చేయడంతో 18 పరుగుల తేడాతో కొమ్మలపూడి జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ట్రోఫీతోపాటు రూ.30 వేల నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. అలాగే రన్నర్ మనుబోలు జట్టుకు రూ.20 వేల నగదు బహుమతి అందజేశారు. ఆదివారం రాత్రి నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో సేవానాథం అధ్యక్షుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, గూడూరు డీఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్‌వీ మూర్తి తదితరులు విజేత, రన్నర్ జట్లకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు.

కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పూజలు



వాసవీ కన్యకా పరమేశ్వరీదేవికి పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి స్థానిక శివాలయం వరకు అమ్మవారిని వెండి పల్లకిలో ఊరేగించారు. శివాలయంలో ప్రత్యేక పూజల అనంతరం మహిళా భక్తులు శాస్త్రోక్తంగా 108 కలశాలతో బయలుదేరారు. తర్వాత అమ్మవారికి కలశాల జలంతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ, హోమం, సహస్ర నామ పారాయణం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు శాశ్వత ఉభయకర్తలుగా ఆకులూరు నరసింహులు జ్ఞాపకార్థం ఆయన కుమారులు మధు, హేమంత్‌కుమార్, సుబ్బారావు కుమారులు సురేంద్రబాబు, లక్ష్మీనారాయణ, సాయికుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పోరాట యోధుడు నేతాజీ



నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న హెచ్‌ఎం చెంచురామయ్య, ఉపాధ్యాయులు

ముత్తుకూరు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాట యోధుడని ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చెంచురామయ్య అన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా సోమవారం ఆ పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి హెచ్‌ఎం మాట్లాడుతూ తెల్లదొరల పాలనను ఎదుర్కొనేందుకు ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించిన దేశభక్తుడు నేతాజీ అని కొనియాడారు. తనదైన శైలిలో స్వాతంత్ర పోరాటం చేశారని గుర్తుచేశారు. నేతాజీ ఆశయాలు, ఆదర్శాలను యువత, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

జిల్లా సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక



కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

బుచ్చిరెడ్డిపాళెం: అనకాపల్లి జిల్లా అంకుపల్లిలో ఈ నెల 25 నుంచి మూడ్రోజుల పాటు జరగనున్న 70వ అంతర్‌జిల్లాల సీనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా కబడ్డీ జట్టు ను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీ డేవిడ్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని రా ఘవరెడ్డినగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో జిల్లా కబడ్డీ జట్టు ఎంపికలను సోమవారం నిర్వహించారు. సీనియర్ క్రీడాకారులు శ్రీధర్, గోపాల్, శ్రావణ్‌కుమా ర్, మునిచంద్ర, రాజేష్, సుధీర్, పవన్, సునీల్, సా యి, మహేంద్ర, హనీఫ్, దేవదత్తను ఎంపిక చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



బుచ్చిరెడ్డిపాళెం: సచివాలయ ఉద్యోగుల సంఘ క్యాలెండర్లను ఎంపీడీఓ నరసింహారావు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు విజయ్‌కుమార్, లక్ష్మి, అనిత, నాయబ్‌రసూల్, జగదీష్, అనిల్, సలీం, శేఖర్, వినయ్‌క్రాంత్, వెంకటేశ్వర్లు, సుందర్, చలపతి, సౌందర్య పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు



బుచ్చిరెడ్డిపాళెం: స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం రామకృష్ణ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హెచ్‌ఎం డీ మురళీమోహన్‌రావు, ఎంపీహెచ్ఎస్ టీ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ కే పద్మజ, ఎంపీహెచ్ఏలు టీ రాధమ్మ, సీహెచ్ సుధాకర్, ఆశా కార్యకర్తలు డీ రాజేశ్వరి, ఎన్ కల్పన, టీ శీనమ్మ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం



పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, ఆలయ ప్రవేశం, అఖండ దీపారాధన తదితర పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీకళానికేతన్ బృందం నెల్లూరు వారు కోలాట భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి, అల్లూరు రమణయ్యస్వామి తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఊటుకూరు విద్యార్థులు



బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్–14 రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికై నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం బుజ్జయ్య సోమవారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు సిరి, తేజశ్విని, మైమున్, కావ్యశ్రీ, సంజన, చైత్ర, ప్రవల్లిక జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటి ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు నూజివీడులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. క్రీడాకారులను హెచ్‌ఎంతో పాటు పీఈటీ కృష్ణమోహన్ అభినందించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయశాఖ ట్రెయినింగ్ కోఆర్డినేటర్ సత్యవాణి సోమవారం తనిఖీ చేశారు. శ్రీ వెంకటేశ్వర ఎరువుల దుకాణంలో దాదాపు రూ.12లక్షల విలువైన ఎరువులు, రూ.6.50లక్షల విలువైన పురుగు మందుల నిల్వలకు సంబంధించి సరైన రికార్డులు చూపకపోవడంతో వాటిని విక్రయించరాదని ఆదేశించారు. ఆమె వెంట ఏఓ సురేంద్రరెడ్డి ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కొడవలూరు: ఉపాధి కూలీలు జాబ్ కార్డులకు ఆధార్ సీడింగ్‌ను విధిగా చేయించుకోవాలని ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం సూచించారు. కొడవలూరులో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. కూలీలకు సూచనలు చేశారు.